

లెక్క తేల్చారు

సూపర్-6 హామీలో భాగంగా ఆర్టీసీలో మహిళలకు 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత ప్రయాణం కల్పించింది. ఇదే క్రమంలో ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు సైతం నష్టపోకుండా 'వాహన మిత్ర' పేరుతో ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వైసీపీ హయాంలో రూ.10వేలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.15వేలు అందించే దిశగా శ్రీకారం చుట్టింది. దీంతో ఆయా వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో గడువు లోపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24,197మంది 'వాహనమిత్ర' కోసం దరఖాస్తు చేసుకున్నారు.

- 'వాహన మిత్ర'కు 24,841 దరఖాస్తులు
- 24,197 మంది అర్హులుగా గుర్తింపు
- 644 దరఖాస్తులు తిరస్కరణ
- అక్టోబరు 4న డ్రైవర్ల అకౌంట్లకు నగదు జమ

నంద్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకానికి వచ్చిన దరఖాస్తుల లెక్కను రవాణా శాఖాధికారులు తేల్చారు. గత ప్రభుత్వంలో లబ్ధి పొందిన వారితో పాటు కొత్త లబ్ధిదారులు కూడా ఉన్నట్లు తెలిసింది. వీరిలో అర్హులైన వారందరికీ అక్టోబరు 4వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారని సమాచారం. ఆరోజున డ్రైవర్లతో పాటు ఆయా కుటుంబాల్లో సందడి వాతావరణం మొదలు కానుంది.

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా పేరు	దరఖాస్తులు	అర్హులు	తిరస్కరణ
కర్నూలు	14,435	14,191	244
నంద్యాల	10,406	10,006	400
మొత్తం	24,841	24,197	644

గతం కంటే ఎక్కువగా...

ఉమ్మడి జిల్లా పరంగా పరిశీలిస్తే గత వైసీపీ హయాంలో కర్నూలు జిల్లాలో సుమారు 10 వేలు.. నంద్యాల జిల్లాలో 8,900మంది మాత్రమే లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న 'వాహనమిత్ర' కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికార లెక్కల ప్రకారం.. 24,841మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 24,197మంది అర్హులుగా అధికార యంత్రాంగం గుర్తించింది. మిగిలిన 644 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. అయితే వీరిలో కూడా అర్హులు ఉంటే రెండో విడత కింద అందజేస్తారని తెలిసింది. మొత్తంగా వైసీపీ కంటే కూటమి ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారుల సంఖ్య 5 వేలకుపైగా పెరిగినట్లైంది.



అర్హుల జాబితా సిద్ధం

ప్రభుత్వ ఆదేశాలు మేరకు 'వాహనమిత్ర' కింద అర్హుల జాబితాను సిద్ధం చేశాం. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లో అక్టోబరు 4న జమ కానుంది. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించిన డ్రైవర్లు కూడా ఎలాంటి ఆందోళన చెందొద్దు. తగిన ఆధారాలు ఉంటే అర్హులుగా గుర్తించి రెండో విడతలో అందిస్తాం.

● జీవీ శివారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి, నంద్యాల

పక్కాగా పరిశీలన...

'వాహన మిత్ర' కింద అర్హులైనవారికి న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన చేసింది. మండలాలు, మున్సిపాలిటీ, పట్టణ ప్రాంతాల వారిగా ఆన్‌లైన్‌లో ఆన్‌లైన్ వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తంగా అర్హులైన వారందరికి వాహన మిత్ర లబ్ధి చేకూరనుంది.

గ్రామ, వార్డు సచివాలయాల్లో..

అర్హులు.. అనర్హుల జాబితాను ఉమ్మడి జిల్లాలోని ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈనెల 30వ తేదీన ప్రదర్శించనున్నారు. దీంతో వాహన మిత్ర లబ్ధిదారుల్లో సైతం ఉత్కంఠ వీడనుంది. అధికార లెక్కల ప్రకారం.. అర్హులైన 24,197మందికి సంబంధించి ప్రభుత్వం రూ. 36.30 కోట్లు జమ చేయనుంది.

కాత్యాయనిగా భ్రమరాంబికాదేవి

- శ్రీశైలంలో ఆరో రోజు వైభవంగా కొనసాగిన శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఆరో రోజు శనివారం అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చన, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారాలు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాల జపానుష్ఠానాలు, చండీ హోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానాలు, చండీ, చతుర్వేద పారాయణలు, కుమారీ పూజలు నిర్వహించారు. అలాగే రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు నిర్వహించారు. రాత్రి 9 గంటల నుంచి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు చేశారు. భ్రమరాంబికాదేవి కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవదుర్గలలో ఆరో రూపమైన ఈ దేవి చుతుర్భుజాలను కలిగి ఉండి, కుడివైపున అభయ హస్తాన్ని, వరముద్రను, ఎడమ వైపున పద్మాన్ని, ఖడ్గాన్ని ధరించి ఉంటారు. వర్షం కారణంగా స్వామి, అమ్మవార్ల హంస వాహన సేవ, పుష్ప పల్లకీ సేవలను రద్దు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నెల్లూరుకు చెందిన కె. సుధాకరరావు, వారి బృందం చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరింపజేశాయి.

నేటి కార్యక్రమాలు: భ్రమరాంబ అమ్మవారు ఏడో రోజు ఆదివారం కాళరాత్రి అలంకారంలో దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు గజ వాహనం సేవ నిర్వహించనున్నారు.



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



నృత్యం చేస్తున్న మహిళలు

జిల్లాలో వర్షాలు

- మహానందిలో అత్యధికంగా 87.2 మి.మీ. వర్షపాతం నమోదు



బుక్కాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు అలుగు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా మహానంది, వెలుగోడు, నంద్యాల బండిఆత్మకూరు, బేతంచర్ల, బనగానపల్లె మండలాల్లో భారీ వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా శనివారం ఒక్కరోజే 1216.8 మి.మీ. వర్షపాతం నమోదయింది. అనేక మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మహానంది మండలంలో అత్యధికంగా 87.2 ఎంఎం వర్షపాతం నమోదయింది. దీంతో బుక్కాపురం వద్ద చెరువు అలుగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెలుగోడు మండలంలో 77.6, నంద్యాల మండలం 74.2, ఆత్మకూరు 73.4, నంద్యాల పట్టణం 70.0, బండిఆత్మకూరు 63.2, బేతంచర్ల 60.4, బనగానపల్లె 58.0, కొత్తపల్లె 57.0, శ్రీశైలం 55.0, పాణ్యం 52.4, నందికొట్కూరు మండలంలో 51.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అలాగే జూపాడుబంగ్లా 51.4, పాములపాడు 51.2, పగిడ్యాల 44.8, డోన్ 42.2, గడివేముల 39.4, గోస్పాడు 38.0, మిడ్తూరు 37.2, కోవెలకుంట్ల 32.0, శిరివెళ్ల 19.2, రుద్రవరం 16.8, ప్యాపిలి 15.2, దొర్నిపాడు 12.4, అవుకు 11.4, సంజామల మండలంలో 9.6 ఎంఎం వర్షపాతం నమోదయింది.

సమయ పాలన పాటించాలి

ఆళ్లగడ్డ/ శిరివెళ్ల సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని అహోబిలం ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల పీహెచ్‌సీలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యులు ఫిరోజ్, కావ్య చందన, ఎంపీ హెచ్‌ఈవో నాగార్జునరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే..

నంద్యాల హాస్పిటల్: జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డా.ఆర్.వెంకటరమణ తెలిపారు. అలాంటి కేంద్రాలను సీజ్ చేస్తామన్నారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్-1994సలహా కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. డీఐవో సుదర్శన్ బాబు, డెమో ఇన్‌చార్జి కె.రవీంద్రనాయక్, వైద్యాధికారులు పద్మజ, అరుణజ్యోతి, శ్రావణ్‌కుమార్, ఎన్‌జీవోలు డా.రాజశేఖర్, పాల్‌రాజారావు, రామారావు, న్యాయవాది మోతీలాల్, వంశీ పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ



ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులోని ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ రాజకుమారి శనివారం తనిఖీ చేశారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తొలగించి కలెక్టర్ ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేసి తనిఖీలను అధికారికంగా నమోదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ గార్డులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ కీలకం: కలెక్టర్

నూతన జాతీయ విద్యావిధానంలో విద్యార్థుల విద్యాపురోగతిని ట్రాక్ చేయడానికి అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కీలకమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. పట్టణంలోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం అపార్ ఐడీ ప్రగతిపై కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 138 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న 16,102 మంది విద్యార్థుల్లో 11,301 మంది విద్యార్థులకు అపార్ ఐడీ పూర్తయిందని తెలిపారు. పదో తరగతి సర్టిఫికేట్‌లోని పేరు, పుట్టిన తేదీ, ఆధార్‌లోని పేరు పుట్టినతేదీ సమానంగా ఉంటేనే అపార్ ఐడీ జనరేట్ అవుతుందని చెప్పారు. ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లి రూ.50లు చెల్లించి అపార్ ఐడీ జనరేట్ చేయించుకోవాలని సూచించారు. 1962 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 3,30,135 మంది విద్యార్థుల్లో 2,72,193 మందికి అపార్ ఐడీ పూర్తయిందని, మిగిలిన 57,942 మంది ఐడీలు త్వరితగిన పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 40,798 మంది చిన్నారులలో 24,936 మందికి అపార్ ఐడీ పూర్తి కాగా 15,894 ఐడీలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. డీఈవో, డీవీఈవో, ఐసీడీఎస్ పీడీలు పూర్తి స్థాయిలో దృష్టిసారించి ప్రత్యేక చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఈవో జనార్దన్‌రెడ్డి, డీవీఈవో శంకర్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి భారీ వరద

10 గేట్లతో నీటి విడుదల



10 గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. శనివారం జలాశయం క్రస్ట్‌గేట్ల ఎత్తు 18 అడుగులకు పెంచారు. 10 గేట్ల స్పిల్‌వే నుంచి 4,26,160 క్యూసెక్కుల వరద నీటిని సాగర్‌కు సాగనంపతున్నారు. డ్యాం నీటిమట్టం శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 882 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 203 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 65,164 క్యూసెక్యులు విడుదల చేశారు.




శ్రీశైలంలో డ్రోన్ చక్కర్లు

శ్రీశైలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల ఆలయం పరిసరాల్లో డ్రోన్ చక్కర్లు కొట్టింది. స్థానికుల సమాచారంతో దేవస్థానం భద్రతా విభాగం, స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. శ్రీశైలంలో గల శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద డ్రోన్ ఎగురవేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వ్యక్తి పవన్‌గా గుర్తించారు. స్థానికంగా ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చి అవగాహన లోపంతో డ్రోన్‌ను ఎగురవేసినట్లు తెలిసింది. అతని వద్ద నుంచి అధికారులు డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈవిషయంపై వన్‌టౌన్ సీఐ ప్రసాదరావుతో మాట్లాడగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న డ్రోన్

తిలకం చుక్కలతో భగత్‌సింగ్ చిత్రం



నంద్యాలకు చెందిన శ్రేష్ట శనివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని 3,265 తిలకం చుక్కలతో భగత్‌సింగ్ చిత్రాన్ని చిత్రీకరించింది. 14ఇంటూ 10 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్టు మీద తిలకం చుక్కలతో భగత్‌సింగ్ చిత్రాన్ని తయారుచేసింది. ఏడో తరగతి చదువుతున్న శ్రేష్ట కోటేష్ ఆర్ట్ అకాడమీ లో శిక్షణ తీసుకుంటుంది. చిట్టిచేతులతో భగత్‌సింగ్ చిత్రాన్ని చిత్రీకరించినందుకు గురువు కోటేష్ అభినందించారు.



● నంద్యాల కల్చరల్, ఆంధ్రజ్యోతి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా ఉమా



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ పి.ఉమాను పదోన్నతిపై నియమిస్తూ వైద్యఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా వైద్యఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఉమాకు సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి డీఐవోగా నియమించారు. ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్‌గా నాలుగు సంవత్సరాలు పని చేసిన ఆమెను గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న డీఐవోగా నియమిస్తూ హెల్త్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త డీఐవోకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



కాత్యాయనీమాత అలంకారంలో చౌడేశ్వరీమాత అమ్మవారు



లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు



మహానందిలో కాత్యాయని దుర్గ అలంకరణలో కామేశ్వరీదేవి



గీతామందిరంలో వేంకటేశ్వర స్వామి అలంకరణలో అమ్మవారు

ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్/గూడూరు/బనగానపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు శనివారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణతోపాటు విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కర్నూలు నగరంలోని చిన్న అమ్మవారిశాలలో వాసవీమాత పద్మావతి-వేంకటేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వన్ టౌన్‌లోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి వేంకటేశ్వర స్వామిగా, కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. గోదా గోకుల క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి లలితా త్రిపుర సుందరీ దేవి పూజలు చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత కాత్యాయనీమాతగా దర్శనమిచ్చారు. గూడూరు మండలం కె.నాగలాపురంలోని సుంకులాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

కాత్యాయని దుర్గగా కామేశ్వరీదేవి

మహానంది, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆరో రోజు అమ్మవారి ఆలయంలో అర్చకుడు వనిపెంట ప్రకాశంశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల మంటపంలో వేదపండితులు, రుత్వికులు భక్తిశ్రద్ధలతో చండీ యాగం, హోమాలను నిర్వహించారు. సాయంకాలం 6 గంటల నుంచి కామేశ్వరీదేవిని కాత్యాయని దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. కాత్యాయని దుర్గ అలంకారంలో ఉన్న అమ్మవారు గజ వాహనంపై విహరించారు. ఉత్సవం ముందు చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



చిన్న అమ్మవారిశాలలో అమ్మవారికి పద్మావతి-వేంకటేశ్వర స్వామి అలంకరణ

పర్యాటక రంగం అభివృద్ధికి కృషి

● కలెక్టర్ డాక్టర్ సిరి





కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిరి మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం థీమ్ స్థిరమైన పర్యాటకం, పరివర్తన అని తెలిపారు. జిల్లాలో రూ.14 కోట్లతో ఐదు టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారన్నారు. జిల్లాలో కేవలం 7 శాతం మాత్రమే అడవులు ఉన్నాయనీ, దీన్ని 50 శాతానికి పెంచే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. జడ్పీ సీఈఓ నాసర రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో కొన్ని దేశాలు కేవలం పర్యాటకంపైనే మనుగడ సాధిస్తున్నాయన్నారు. టూరిజం శాఖ సలహాదారులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జిల్లాలో కేతవరం, జొన్నగిరి వంటి ప్రాంతాల్లో తెలుగులో శాసనాలు ఉన్నాయన్నారు. జిల్లాలో కొండారెడ్డి బురుజు, తదితర అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని మనం కాపాడుకోవాలన్నారు. టూరిజం శాఖ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ పర్యాటకాన్ని అభివద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాలో శిల్పారామం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, డీఎస్‌ఓ రాజా రఘువీర్, ఆర్‌ఐఓ లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ పర్యాటక దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కళాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కల్పించాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య కలెక్టర్ డాక్టర్ ఏ.సిరిని కోరారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంను కళాకారులు, కళల కోసం ఉచితంగా కేటాయించాలన్నారు. దీంతో పాటు కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కళాసమితికి యువ కళాకారులతో కూడిన కొత్త కార్యవర్గాన్ని నియమించాలన్నారు. ప్రభుత్వం సహకరిస్తే టీజీవీ కళాక్షేత్రం సంయుక్తంగా వారం రోజుల పాటు కర్నూలు ఉత్సవ్ పేరుతో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

అలివి వలతో చేపల వేట

● ఇంజిన్ బోట్లనూ వినియోగిస్తున్న మత్స్యకారులు
● చేప పిల్లలను పట్టేసి విక్రయిస్తున్న వైనం
● ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో జీవనాధారం కోల్పోయే ప్రమాదం



చిన్న చేపలను పట్టుతున్న మత్స్యకారులు

శ్రీశైలం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అలివి వలలు.. ఇంజిన్ బోట్ల చేపలు వేటాడడం నిషేధం. అయినప్పటికీ మత్స్యకారులు అవేవీ పట్టించుకోడం లేదు. చేప పిల్లలు ఎదగక ముందే అలివి వలలతో వేట కొనసాగించి వాటి పట్టి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం డబ్బు సంపాదించుకోవాలన్న ఉద్దేశంతో ఉన్నారు. అయితే భవిష్యత్తులో జీవనాధారం లేకుండా చేసుకుంటున్నారు. శ్రీశైలం మండలంలోని లింగాలగట్టు గ్రామవాసుల జీవనాధారం చేపల వేట. అయితే చేప పిల్లలు ఎదగక ముందే చిదిమేస్తున్నారు. శ్రీశైలం డ్యాం గేట్లను తెరిచిన సమయంలో నీటి ప్రవాహ వేగం ఎక్కువ ఉంటుంది. అయినప్పటికీ పెద్ద బ్రిడ్జి కింద ప్రమాదపుటంచుల్లో పుట్టీలపై వేట సాగిస్తున్నారు. లింగాలగట్టు గ్రామం హైదరాబాద్ రహదారిలో ఉండడంతో చేపల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. జూన్ నుంచి ఆగస్టు వరకు చేప గుడ్లు పెట్టే కాలంలో చేపల వేట అనేది నిషేదం ఉన్నా.. మత్స్యశాఖ అధికారుల నోటీసులను మత్స్యకారులు పెడచెవిన పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లింగాలగట్టు గ్రామంలో చాపలు ఎగుమతి చేసే కంపెనీలు శ్రీశైలం జలశయంలోని చాపలను ఇతర ప్రాంతాలకు సైతం వాహనాల ద్వారా ఎగుమతులు చేస్తు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆత్మకూరు ఎఫ్‌డీవో అధికారి భరత్‌లాల్ నాయక్‌ను వివరణ కోరగా లింగాలగట్టు గ్రామాన్ని సందర్శిస్తామని తెలిపారు. పరిశీలన అనంతరం చర్యలపై వివారాలు తెలియజేస్తామన్నారు.





చేపల ఎగుమతికి సిద్ధంగా వాహనాలు



ఇంజిన్ బోట్ల నుంచి తెచ్చిన చేపలు

మంత్రాలయానికి కొత్త శోభ

● త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
● రూ.20కోట్ల ఒప్పందంతో పనులు
● పర్యాటక రంగానికి పెద్దపీట
● వందలాది మందికి ఉపాధి



మంత్రాలయంలో త్రీస్టార్ హోటల్ నిర్మించే భవనం నమూనా

మంత్రాలయం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండో తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయానికి కొత్త శోభ రానుంది. రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ కేబినెట్ సమావేశంలో మంత్రాలయానికి త్రీస్టార్ హోటల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 4.25 ఎకరాల్లో ఈహోటల్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అమరపాలి, హైదరాబాదు చెందిన అబోడే హోటల్ ఎండీ రామస్వామి వెంకటరమేష్ పారిశ్రామికవేత్తలతో రూ.20కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఉపాధి కల్పించడమే లక్ష్యంగా..

ఇందుకోసం 400 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది. ప్రభుత్వం కేటాయించిన ఈస్థలంలో 120 గదులు, రెస్టారెంట్, కాఫీ షాప్, కల్యాణ మండపం, కింది బాగంలో సెల్లార్ పనులు ప్రారంభమయ్యాయి ఇప్పటికే మెటీరియల్ అంతా సిద్ధం చేసుకుని వచ్చే ఆగస్టు నాటికి 120రూములు నిర్మించేందుకు అబోడే హోటల్ యజమానులు శ్రీకారం చుట్టారు. 2017లో అబోడే హోటల్ నిర్మాణం చేపట్టి భక్తులకు వసతి, రెస్టారెంటు కొనసాగుతుంది. గత వైసీపీ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లోనే మంత్రాలయానికి త్రీస్టార్ హోటల్ రావడం, దాదాపు 400మందికి ఉపాధి కల్పనతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కల్పిస్తున్నాం



ఏపీ రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. త్రీస్టార్ హోటల్ నిర్మాణంతో దాదాపు 400 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో 120రూములు, రెస్టారెంటు, కల్యాణ మండపం పనులు ఇప్పటికే ప్రారంభించాం. వచ్చే ఏడాదికి పనులు పూర్తిచేస్తాం.

● రజనీకాంత్, మేనేజర్, అబోడే హోటల్, మంత్రాలయం



సీఎం చంద్రబాబుతో మంత్రాలయం స్టార్ హోటల్‌కు ఒప్పందం అగ్రిమెంటు తీసుకుంటున్న రమేష్ (ఫైల్)

స్త్రీనిధిలో చేతివాటం

● నాలుగేళ్లుగా ఖాతా బ్లాక్
● రుణం కోసం పొదుపు మహిళల ఎదురు చూపు
● పొందిన రుణాల్లో సీసీల చేతివాటం..?



చేతివాటానికి కాదేదీ అనర్హం అన్నచందంగా స్త్రీనిధి రుణాల్లోనూ కొందరు సీసీలు అవినీతికి పాల్పడ్డారు. పొందిన రుణాలను కొందరు సక్రమంగా చెల్లించకపోవడంతో పొదుపు సంఘంలో మిగిలిన వారికి భారంగా మారింది. దీంతో ఈ పథకాన్ని నాలుగేళ్ల క్రితం బ్లాక్ చేశారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

రుద్రవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు స్త్రీనిధి చేయూతనిస్తుంది. స్వయం ఉపాధి వైపు అడుగులు వేయిస్తుంది. ఆర్థిక క్రమశిక్షణ ఆధారంగా పొదుపు సంఘాలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు భారీగా రుణాలు మంజూరు చేస్తాయి. కానీ రుద్రవరం మండలంలో స్త్రీనిధి ఖాతా బ్లాక్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా మహిళలు రుణం కోసం ఎదురు చూపే తప్ప ఖాతా మాత్రం తెరవలేదు. రుద్రవరం వెలుగు కార్యాలయం పరిధిలో స్త్రీనిధి ఖాతా సుమారు నాలుగేళ్ల క్రితం బ్లాక్ చేశారు. స్త్రీనిధి రుణాలు పొంది చెల్లించకపోవడంతో ఆ పథకాన్ని బ్లాక్ చేశారు. రుద్రవరం మండలంలో 1103 పొదుపు సంఘాలు, 12103 మంది సభ్యులు, 46మంది వీవోలు ఉన్నారు. సుమారు రూ.35 లక్షలు బకాయి ఉంది. రికవరీ కాకపోవడంతో నాలుగేళ్లక్రితం ఖాతాను బ్లాక్ చేశారు. అధికారులు, కొందరు పొదుపు మహిళల నిర్లక్ష్యం మగిలిన సభ్యులందరికీ శాపంగా మారింది. తీసుకున్న స్త్రీనిధి రుణాలను సక్రమంగా రికవరీ చేయించడంలో అధికారులు పట్టించుకోకపోవడంతో మిగతా వారికి భారమైంది. పొందిన రుణాల్లో సీసీలు కూడా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

రుణాల కోసం ఎదురుచూపు?

స్త్రీనిధి రుణాల కోసం పొదుపు మహిళలు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. అక్రమాలు జరగడంతో వారు స్త్రీనిధి ద్వారా రుణాలు పొందే అవకాశం కోల్పోయారు. ఇందులో అప్పట్లో పనిచేసిన సీసీల ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రికవరీలు సరిగ్గా కాకపోవడంతో ఖాతాను లాక్ చేశారు. అర్హులైన పొదుపు మహిళలు కూడా రుణాలు పొందలేదు. ఇలా అధికారుల నిర్లక్ష్యం పొదుపు మహిళలకు శాపంగా మారింది. అప్పట్లో పొందిన స్త్రీనిధి రుణాల్లో సీసీలు చేతివాటం ప్రదర్శించారు. కొందరు రుణాలు తీసుకుని ఇంత వరకు చెల్లించకపోవడంతో బకాయిలు అలాగే ఉండిపోయాయి. దీనివల్ల అర్హులైన పలువురు పొదుపు మహిళలకు స్త్రీనిధి రుణం తీసుకోవడానికి ఆస్కారం లేకుండాపోయింది. తీసుకున్న రుణాలను అప్పట్లో పనిచేసిన సీసీలు, కొంత మంది మహిళలు కలిసి తిరిగి చెల్లించకపోవడమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి. ఆ ఖాతా నేటికీ తెరవలేదు. దీంతో రుణం పొందలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రుద్రవరం వెలుగు కార్యాలయం

పీడీ దృష్టికి తీసుకెళుతున్నా



స్త్రీనిధిలో జరిగిన అవినీతి విషయం డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నా. రూ.24లక్షలు ఉన్న రుణ బకాయిలు రూ.10లక్షల వరకు తెచ్చా. ఇంకా రూ.14లక్షలు బకాయిలు మిగిలాయి. ఈ విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లి ఖాతా తెరిపించి పొదుపు మహిళలకు రుణాలు అందేలా కృషి చేస్తా.

● వసంతకుమారి, ఏపీఎం, వెలుగు, రుద్రవరం

విజయ డెయిరీలో అవినీతిని అరికట్టాలి

• ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయ డెయిరీ అంటే ఒక బ్రాండ్ అని, దీని వెనకల ప్రభుత్వం ఉందని, స్వచ్ఛమైన పాలు, నెయ్యి అందించడంలో ఈ డెయిరీకి మంచినది లేదని పేరుండేదని చెప్పారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నంద్యాల డెయిరీని ఏర్పాటు చేశారని, అయితే ప్రస్తుత చైర్మన్ ఆయన ఫొటోను, శిలాఫలకాన్ని పక్కన పడేశారని చెప్పారు. గతంలో 30ఏళ్లు భూమా నారాయణరెడ్డి చైర్మన్‌గా ఉండేవారని, అప్పట్లో ఒక్క చుక్క పాలు కల్తీ కాకుండా, అవినీతి జరగకుండా సంస్థను అభివృద్ధి పథకంలో నడిపించారని అన్నారు. అయితే ఈ డెయిరీపై వైసీపీ నాయకుల కన్ను పడినప్పటి నుంచి పాలు కల్తీమయంగా మారాయన్నారు. విజయ డెయిర్ బ్రాండ్ ను అడ్డు పెట్టుకొని చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. ఎవరైై ప్రశ్నిస్తే వారిని విధుల నుంచి తొలగిస్తున్నారని, ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని ఆరోపించారు.

విచారించి చర్యలు తీసుకుంటాం : మంత్రి అచ్చెన్నాయుడు

నంద్యాల విజయ డెయిరీపై వచ్చిన ఆరోపణ లపై కమిటీ వేసి విచారించి చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళగిరిలోని డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ వారిని విచారణ అధికారిగా నియమించామని చెప్పారు. వారు ఇచ్చే నివేదికల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

10లోపు ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 2026లో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పరీక్ష ఫీజు చెల్లించడానికి వచ్చే నెల 10న చివరి తేదీ అని ఆర్ఐవో జి.లాలెప్ప శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా సెలవుల అనంతరం అక్టోబరు 6వ తేదీన కళాశాలలకు విద్యార్థులు వచ్చినప్పుడు తప్పనిసరిగా పరీక్ష ఫీజులు చెల్లించేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు కూడా చివరి తేదీ వరకు వేచి ఉండకుండా పరీక్ష ఫీజు ఆన్‌లైన్ పేమెంట్ గాని, బ్యాంకు చలానా రూపంలో గాని చెల్లించేలా చూడాలన్నారు. దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు అధికారులు కళాశాలల యజమాన్యాలను హెచ్చరించారు.

వర్షాలకు 70గొర్రెలు మృతి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సోగనూరు 70కి పైగా గొర్రెలు మృతిచెందాయి. శనివారం ఈఘటన చోటుచేసుకున్నట్లు గొర్రెల కాపరులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన పెద్దలక్ష్మన్న 10, రాజు 12, నబీరసూల్ 8, గొర్రెల రామయ్య 8, పరుశురాముడు 10, వీరేష్ 12, దానరి గిడ్డయ్య 12, చిన్నలక్ష్మన్న 3, ఉలిగప్పతో పాటు మరి కొంతమంది గొర్రెలు మృతిచెందాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. ఈఘటనపై వెటర్నరీ ఏడీ సుబ్రమణ్యంను వివరణ కోరగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గొర్రెలు మృతి చెందాయన్నారు. జీవాలు వర్షానికి తడవకుండా గొర్రెల కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



మృతి చెందిన గొర్రెలు

వ్యవసాయ మోటార్లు చోరీ

శిరివెళ్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె నుంచి ఇసుకపల్లెకు వెళ్లే రహదారిలోని రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. శిరివెళ్ల ఎస్ఐ చిన్న వీరయ్య తెలిపిన వివరాలివీ.. గోవిందపల్లెకు చెందిన రైతులు శ్రీనివాసరెడ్డి, రామయ్య, కాశయ్య పొలాల్లోని వ్యవసాయ మోటార్లను(రూ.65 వేలు విలువ చేసే) గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారన్నారు. బాధిత రైతు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కియ షోరూం ప్రారంభం

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు మండల పరిధిలోని దీబగుంట్ల గ్రామ సమీపంలో ఎంజీబీ గ్రూప్ సీఈవో ఆదిత్య మాచాని కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కియ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షోరూంలో అన్నిరకాల కియ వాహనాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలవారు షోరూంను సందర్శించి టెస్ట్ డ్రైవ్ చేయాలని తెలిపారు. ఎంజీబీ గ్రూప్ మెంబర్ తారకేశ్వర్ జనరల్ మేనేజర్ ఎల్లప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



షోరూం ప్రారంభిస్తున్న ఎంజీబీ గ్రూప్ సీఈవో ఆదిత్య మాచాని, కుటుంబసభ్యులు

పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ డీడీ రమణయ్య

చాగలమర్రి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆళ్లగడ్డ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య తెలిపారు. పశువైద్య కేంద్రంలో శనివారం ఏడీ వరప్రసాద్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ రైతులు పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆళ్లగడ్డ డివిజన్‌లో 1.49 లక్షల పశువుల ఉండగా 1.3 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. పశువైద్యాధికారులు సాయిబాబా, రవింద్రారెడ్డి, దీపకుమారి ఉన్నారు.

గుండె ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

• జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ విభాగంలో వరల్డ్ హార్ట్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గుండె జబ్బులు మరణాలకు ప్రధాన కారణాలు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒక్కసారి గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్డియాలజీ విభాగ వైద్యనిపుణులు డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ రవికిరణ్, పీజీలు శ్రీకాంత్, నవాజ్, రవికిరణ్, ప్రణీత్, తనూష్, కార్డియాలజీ టెక్నీషియన్ పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం



కోడుమూరు: కంది పొలంలో నిలిచిన నీరు

• దేవనకొండలో అత్యధికంగా 142.6 మి.మీ. వర్షపాతం నమోదు

• పంటలు నీట మునగడంతో అన్నదాతల ఆవేదన

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మొత్తం అన్ని మండలాల్లో 20మి.మీ మించి వర్షాపాతం నమోదయింది. అత్యధికంగా దేవనకొండలో 142.6 మి.మీ వర్షపాతం నమోదయింది. ఆదోనిలో 126.2 ఎంఎం, మంత్రాలయం 99.4, ఎమ్మిగనూరు 88ఎంఎం, నందవరం 85.6, గోనెగండ్ల 83.6, పెద్దకడుబూరు 76.4, కౌతాళం 66.2, వెల్దుర్తి 65.6, ఆస్పరి 62.2, గూడూరు 59.6, సి.బెళగల్‌లో 58.8, కోడుమూరు 58.2, కల్లూరు 53.6, కర్నూలు అర్బన్‌లో 51.8 వర్షపాతం నమోదయింది. అలాగే కోసిగిలో 50.2 ఎంఎం, కర్నూలు రూరల్ 47.4, హొళగుంద 46.4, పత్తికొండ 46.2, క్రిష్ణగిరి 43.6, ఓర్వకల్లు 42.6, చిప్పగిరి 36.8, హాలహర్వి 34.4, మద్దికెర 31.6, తుగ్గలి 29.2, ఆలూరులో 25.6 మి.మీ వర్షపాతం నమోదయింది. ఖరీఫ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి దాకా ఈస్థాయిలో అన్ని మండలాల్లో 25 ఎంఎం కంటే ఎక్కువ వర్షం నమోదు కావడం ఇదే తొలిసారి అని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కలిసి సగటున 62 మి.మీ వర్షపాతం నమోదయింది.

చేతికొచ్చిన పంటలు నీటిపాలు

కర్నూలు జిల్లాలో ప్రధాన పంటలన్నీ ప్రస్తుత వర్షాలకు నీటి ముంపునకు గురై చేతికందిన పంటలు నీటిపాలయ్యాయి. తెగుళ్లు, క్రిమికీటకాలు విజృంభించి మరింత నష్టానికి గురి చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. శనివారం ఒడిశా, చత్తీస్‌ఘడ్ మధ్య తీరం దాటింది. దీంతో రాయలసీమ అంతటా మరో రెండు రోజులు ఎడతెరపి లేని వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. కలెక్టర్ సిరి కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ప్రవహిస్తున్న తుంగభద్ర, హంద్రీ, వక్కిలేరు తదితర నదుల తీరం వద్దకు వెళ్లవద్దని సూచించారు.

• చేయి చేయి పట్టు.. వంక దాటేటట్టు



కుంభవృష్టి ధాటికి ఊరువాడా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు వంకలు ఏరులై పారుతున్నాయి.. కుంటలు చెరువులు పొంగి పొర్లుతున్నాయి.. దీంతో పలు ప్రాంతాల్లో జనం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శనివారం కోసిగి మండలం ఉరుకుంద రోడ్డులో ఉన్న చాపవంకకు వరద పోటెత్తడంతో జనం చేయి చేయి పట్టుకుని అతి కష్టమ్మీద వంక దాటారు.

- కోసిగి, (ఆంధ్రజ్యోతి)

దంచికొట్టిన వర్షం



ఆదోనిలో నీట మునిగిన కౌడల్‌పేట

• జల దిగ్బంధంలో లోతట్టు కాలనీలు
• ఇళ్లలోకి చేరిన వరద
• పొంగిపొర్లిన వాగులు, వంకలు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శనివారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టింది. భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతా లన్నీ జలమయమయ్యాయి. ఆవుదూడ వంక, మేక వంక, ఆర్టీసీ కాలనీ వెనుక వైపు నుంచి వెళ్లే ప్రధానమైన వంకలు పొంగిపొర్లాయి. ఆర్టీసీ కొత్త బస్టాండ్ వెనుక వంక పొంగి పొర్లడంతో విట్టాకిష్టప్ప నగర్, ఆర్టీసీ కాలనీ, వల్లభ శ్రీ హోమ్స్‌కు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ఆవుదూడ వంక పొంగడంతో కౌడాల్ పేట, షేర్‌ఖాన్ కొట్టాల, బోయగిరి ప్రాంతాల్లో, డీఎస్పీ బంగ్లా సమీపంలో పెద్ద వంకకు భారీ నీరుచేరడంతో లోతట్టు ప్రాంత మైన శివశంకర్ నగర్‌లోని కొన్ని ఇళ్ళలోకి నీరు చేరాయి. కౌడల్‌పేట లోతట్టు ప్రాంతం లో నడుములోతు నీరు రావడంతో ఇళ్లలో నుంచి బయటికి రాని పరిస్థితి ఉండడంతో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొంకా భూపాల్ ‌చౌదరి, మారుతినాయుడు స్పందించి ఆ కాలనీ టీడీపీ నాయకుడు సుబ్బుతో పాల ప్యాకెట్లు, అల్పాహారాన్ని, మధ్యాహ్నం అహారాన్ని సిద్ధపరిచి ఇంటిం టికి వెళ్లి పంపిణీ చేశారు.

బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ శ్రీనివాసాచారి కొంతమంది శివశంకర్‌నగర్‌లో పర్యటించారు. అక్కడి వారికి ఆహార పొట్లాలు అందజేశారు. తొమ్మిదేళ్ల తర్వాత ఇంతటి భారీ వర్షం రావడంతో రాంజల చెరువు పొంగిపొర్లింది. ఆనీరంతా హౌసింగ్‌బోర్డ్ కాలనీలోకి వచ్చింది. 12.6 సెంటీమీటర్ల (126.8మి.మీ) వర్షపాతం నమోదైంది.

సబ్ కలెక్టర్ పర్యటన

జలమయమైన లోతట్టు ప్రాంతాలు కౌడాల్‌పేట, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎల్ఐజీ కాలనీలోని, టెలికాంనగర్, బావాజీపేటలోని ఇళ్లలోకి నీరు చేరడంతో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ పర్యటించారు. వంకలు, కాలువలు ఆక్రమణ లకు గురికావడం విస్మయానికి గురయ్యారు. పారిశుధ్యాన్ని మెరుగుపరి చేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశారు.



పొంగి పొర్లుతున్న రాంజల చెరువు



వరదను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కమ్మ సంఘాలు సంఘటితమవ్వాలి

• కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి వెంకట సుబ్బారావు



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కమ్మ సంఘాల ప్రతినిధులు సంఘటితంగా ఉండాలని కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొడాలి వెంకట సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పుష్పరాజ్ కన్వెన్షన్ హాల్‌లో కమ్మ వారి సంఘాల పాలకవర్గ సభ్యుల ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడితో పాటు కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, కమ్మసంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కమ్మ కృష్ణమోహన్, కర్నూలు సంఘం కార్యదర్శి పెనికలపాటి రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొడాలి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబును 53రోజులు జైల్లో పెట్టినప్పుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, అలాగే 73 దేశాల్లో నిరసన కార్యక్రమాలు సమష్టి కృషితోనే జరిగాయన్నారు. కమ్మవారిని అభివృద్ధి చేసుకోవడంలో భాగంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి విద్య, హాస్టళ్ల సదుపాయాలు కల్పించడం, నిరుద్యోగులకు పెద్ద సంస్థలకు చెందిన ప్రతినిధులతో చర్చించి ఉద్యోగాలు కల్పించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు సాఫ్ట్ స్కిల్స్ నేర్పించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కార్పొరేట్ ఆసుపత్రులతో చర్చించి పేద వర్గాలకు ఆరోగ్యాన్ని కాపాడి సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని సంఘాలతో విజయవాడలో భారీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు మురకొండ బోసుబాబు, ఉపాధ్యక్షుడు కొంకా ఉమాపతి నాయుడు, కార్యదర్శులు మేడసాని చెన్నకేశవ దుర్గాప్రసాద్, తమ్మినేని రమేష్, దూదిపల్లి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు, అఖిల భారత కమ్మ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోనేని మల్లికార్జునతో పాటు ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలు



బాలుర విజేత పల్నాడు జట్టు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు బహుమతులు అందజేశారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి ఉత్తర్ ప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ విజేతగా పల్నాడు, ద్వితీయ విజేతగా కృష్ణాజిల్లా జట్టు, తృతీయ స్థానంలో నెల్లూరు జట్టు నిలిచిందని తెలిపారు. బాలికల విభాగంలో విజేతగా నెల్లూరు, ద్వితీయ స్థానంలో అన్నమయ్య జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లాలు నిలిచినట్లు తెలిపారు. సభ్యులు నాగరాజు, ప్రభాకర్, గణేశ్, శ్రీనివాసులు, కిరణ్ కుమార్, సుభాన్‌బాషా, మధుసూదన్, పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

• 40ఏళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకున్న స్నేహితులు



డోన్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గురువులతో పూర్వ విద్యార్థులు

డోన్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో వారందరూ విద్యనభ్యసించారు. ప్రస్తుతం తెలంగాణ, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో, హోదాల్లో స్థిరపడ్డారు. అయినప్పటికీ వారి స్నేహ బంధాన్ని మరువలేరు. ఎలాగైనా కలుసుకోవాలనుకున్నారు. వెంటనే ఒకరికొకరు ఫోన్లు చేసుకుని సమావేశమయ్యారు. డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1984-85లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పట్టణంలోని తాము చదువుకున్న పాఠశాలలో శనివారం సమ్మేళనం నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు చదువులు చెప్పిన గురువులైన సుజన ప్రభ, నిర్మలమ్మ, దానమ్మ, వాసు, ప్రభకుమారి, జయరాం, సుబ్బలక్ష్మి, సీతారామయ్య, హిందీ, పీఈటీ టీచర్లను పూల మాలలు, శాలువలతో సన్మానించి వారి ఆశీర్వాదాలు పొందారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు. అందరినీ ఒకే తాటిపైకి తెచ్చేందుకు కృషి చేసిన పూర్వ విద్యార్థినులు టి.లక్ష్మీబాయి, నాగరాజకుమారి, హరిప్రియ, గ్రేసీ, తులసిని అభినందించారు.

జిల్లా కోర్టులో వర్క్‌షాప్ ప్రారంభం

• హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి

కర్నూలు లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరారోపణల రిమాండ్.. జీవిత రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన చట్టాలపై నగరంలోని జిల్లా కోర్టులో శనివారం వర్క్‌షాప్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి ప్రారంభించారు. వ్యక్తిగత స్వేచ్ఛకు, నేరారోపణలపై అరెస్టయి ఖైదీల రిమాండ్‌కు సంబంధించిన ప్రొసీజర్లపై ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. న్యాయాధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రొసీజర్లపై హైకోర్టు న్యాయమూర్తి జిల్లాలోని న్యాయాధికారులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మ, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది, న్యాయాధికారులు లక్ష్మీరాజ్యం, శ్రీవిద్య, ఎం.శోభారాణి, రాజేంద్రబాబు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డులో చెరువు



నగరంలోని ఎన్‌హెచ్-44 గుత్తిరోడ్డు మిస్టర్ఇడ్లీ సమీపంలోని సర్వీస్ రోడ్డు చెరువును తలపిస్తోంది. హైవే అధికారులు రహదారుల నిర్వహణ గాలికి వదిలేయడంతో ఈదుస్థితి వచ్చిందని వాహనదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. - కల్లూరు

పెద్దాసుపత్రిలో మడుగు



కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని శుశ్రుత భవన్ వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. దీంతో రోగులు, వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడే ఆర్థో, ప్లాస్టిక్ సర్జరీ, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ రోగులు అడ్మిషన్, అయి చికిత్స పొందుతుంటారు. ఆవర్షపు నీటిని తొలగించాలని కోరుతున్నారు. - కర్నూలు హాస్పిటల్

బురదమయంగా వర్కూరు రోడ్డు



మండలంలోని వర్కూరు గ్రామంలోని చింతతోట రహదారి బురదమయంగా ఉంది. ఈ మార్గంలోనే చింతతోట, ముస్లింకాలనీ ప్రజలు విద్యార్థులు వెళుతుంటారు. రైతులు పొలాలకు ఎడ్లబండిపై రాకపోకలు సాగిస్తుంటారు. సీసీ రహదారి ఏర్పాటుకు భూమిపూజ చేసినా పనులు ప్రారంభించలేదు. - కోడుమూరు రూరల్

శనగ రైతులను ఆదుకోండి

• పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



కల్లూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో శనగ రైతులను ఆదుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి కోరారు. శనివారం అసెంబ్లీలో మాట్లాడుతూ రైతులు క్వింటాలు రూ.7,075లకు కొనుగోలు చేస్తుండగా సీడ్ ఆర్గనైజేషన్ రైతుల నుంచి క్వింటాలు రూ.7,625లకే కొంటుండటంతో రైతులు క్వింటాలుకు రూ.550లు నష్టపోతున్నారన్నారు. సీడ్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుకోవాలని సీఎం, మంత్రికి ఎమ్మెల్యే విన్నవించారు.

1 నుంచి క్రికెట్ టోర్నమెంట్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 1 నుంచి కర్నూలు మండలం ఈ.తాండ్రపాడులో సూపర్-6 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బి.మిన్నెల్ల, శివకుమార్, శేఖర్ శనివారం ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10,116లు, రెండో బహుమతి రూ.5,116లు, మూడో బహుమతి రూ.3,116లు అందజేస్తామని అన్నారు. ఆసక్తిగలవారు 31వ తేదీ లోపల రూ.500లు చెల్లించి నమోదు చేసుకోవాలని, వివరాలకు 8919205652 నెంబరును సంప్రదించాలన్నారు.

లలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు

• కర్నూలులో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



లలితా పీఠంలో రథోత్సవం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అవతారం దాల్చారు. మహిళా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, మహా మంగళ హారతులు, కుంకుమార్చన చేశారు. పూలబజార్ చిన్న అమ్మవారిశాలలో ఉదయం వాసవి మాత ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సాయంత్రం పద్మావతి-శ్రీవేంకటేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి శ్రీవేంకటేశ్వర స్వామి అలంకరణ చేశారు.



వాసవీ నగర్‌లో వడిబియ్యం కడుతున్న భక్తులు



అయ్యప్పస్వామి ఆలయంలో..



గోకులంలో లలితా త్రిపుర సుందరి అలంకరణ

మాజీ సీఎం కోట్లను ఆదర్శంగా తీసుకోవాలి





కిసాన్ ఘాట్‌లో నివాళి అర్పిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో..

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యువత మాజీ సీఎం, దివంగత కోట్ల విజయభాస్కరరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని డోన్ ఎమ్మెల్యే, కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. కోట్ల వర్ధంతి సందర్భంగా శనివారం నగరంలోని కిసాన్‌ఘాట్‌లోని కోట్ల సమాధి వద్ద నివాళి అర్పించారు. ఎందరికో రాజకీయ ఓనమాలు నేర్పి, తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. డీసీఎంహెచ్‌ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ ఉన్నారు.

నీతి, నిజాయితీకి నిలువుటద్దం కోట్ల

దివంగత మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నీతి, నిజాయితీకి నిలువుటద్దమని సిటీ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. శనివారం డీసీసీ ఆధ్వర్యంలో 24వ వర్ధంతి నిర్వహించారు. రాజకీయాల్లో ఢిల్లీ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుదాకర్ బాబు, బి.బతుకన్న, సుబ్రహ్మణ్యం శెట్టి, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్ ఉన్నారు.

దుర్గా ఘాట్‌ను పరిశీలించిన మాజీ ఎంపీ టీజీ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్ తుంగభద్ర నదిలో దుర్గాఘాట్ వద్ద విగ్రహ నిమజ్జన ఏర్పాట్లను శనివారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పరిశీలించారు. నగరంలో వందకు పైగా విగ్రహాలున్నాయని, నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తిరుపాల్ బాబు, దాశెట్టి శ్రీనివాసులు, విటల్‌శెట్టి పాల్గొన్నారు.

'లోక కల్యాణ్ మేళా'ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'లోక కళ్యాణ్ మేళా' వినియోగించుకోవాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం కౌన్సిల్ హాల్‌లో వీధి విక్రయదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రుణాలు చెల్లించిన వారికి మొదటి విడతలో రూ.10వేల నుంచి రూ.15వేలు, రెండవ విడతలో రూ.20వేలకు పెంచామన్నారు. మెప్మా పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్మిక, ఫుడ్ సేఫ్టీ, పరిశ్రమలు, బ్యాంకుల సిబ్బంది పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, పీఎంజేడివై, ఈశ్రమ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ, క్యూఆర్ కోడ్, ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు.

అవయవదానానికి ముందుకు రావాలి

కర్నూలు హాస్పిటల్/న్యూసిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కిమ్స్ హాస్పిటల్స్ సీఈవో డా.సునీల్ సేపూరి పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్, కిమ్స్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవయవదానం నమోదుకు విశేష స్పందన వచ్చిందని, అవయవదానంతో మరణించిన తర్వాత ఇతరులను బతికించే అవకాశం ఉంటుందన్నారు. కిడ్నీ, కాలేయ మార్పిడి 96 శాతం సక్సెస్ రేటుతో ఇక్కడే చేస్తున్నామన్నారు. అనంతరం దాదాపు 150 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదరిశ ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఏఐవైఎఫ్ కార్యకర్తలు

ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

కల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ బిల్లులను ఆదివారం కూడా చెల్లించేలా చర్యలు తీసుకున్నామని ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. బిల్లుల చెల్లింపు కేంద్రాలు తెరిచి ఉంటాయన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఎస్ఈ సూచించారు.

విద్యుత్ స్తంభాలను తాకొద్దు

సి.బెళగల్, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని ఏఈ సుకుమార్ సూచించారు. శనివారం మండలంలోని కొత్తకోట, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి, పోలకల్లు, సి.బెళగల్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. వర్షం ప్రభావంతో తేమ అధికమై విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

కోడుమూరు మండలంలో భారీ వర్షం

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండురోజుల నుంచి వర్షం కురుస్తోంది. దీంతో రైతన్నకు కంటిమీద కునుకు లేదు. ఉల్లి కోతలు ఆగిపోయి రైతులు దారుణంగా దెబ్బతిన్నారు. చాలామంది రైతులు పొలాల్లోనే ఉల్లిపంటను గొర్రెలకు వదిలేశారు. అలాగే పత్తి పొలాల్లో దూది తడిసిపోయింది. మండలంలోని ఎర్రదొడ్డిలో మట్టిమిద్దె కూలింది. వివరాల మేరకు.. ఎస్సీ కాలనీలో లక్ష్మీదేవి అనే మహిళ ఇంట్లో వంట చేస్తుండగా శబ్దం రావడంతో పరుగును బయటకు వెళ్లింది. వెంటనే మిద్దెకూడలంతో తల, కాళ్లకు గాయాలయ్యాయి.



ఎర్రదొడ్డిలో కూలిన మట్టి మిద్దె

జీఎస్టీ సంస్కరణలతో కుటుంబానికి లబ్ధి

గూడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంబానికి లబ్ది చేకూరిందని టీడీపీ నాయకుడు జె సురేష్ అన్నారు. శనివారం కె.నాగలాపురం గ్రామంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అన్ని వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ఎంపీటీసీ మద్దిలేటి, నాగేష్, గిడ్డయ్య, శ్రీనివాసులు, రాముడు, నాగ సుంకన్న, తిప్పన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

కర్నూలు రూరల్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ భవనంలో జీఎస్టీ తగ్గింపుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉప సహాయ కమిషనర్ గాయత్రి మాట్లాడుతూ 33 రకాల మందులపై జీఎస్టీని కేంద్రప్రభుత్వం తొలగించిందన్నారు. 516 వస్తువులపై 18శాతానికి, మరికొన్నిటింపై 5 శాతినికి వరకు జీఎస్టీని తగ్గించిందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జేమ్స్ కృపావరం, పరిపాలన అధికారి జీవీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని కార్యాలయాల్లో నిర్వహించాలి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతిని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించాలని జేఏసీ సభ్యులు కలెక్టర్ డా.ఏ.సిరిని కోరారు. శనివారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వాల్మీకి సర్కిల్‌లో మహేష్ నాయుడు, మద్దిలేటి, బేతంకృష్ణుడు, కుంపటి కృష్ణుడు, విష్ణు, రవి పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కోడుమూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. రెవెన్యూ అధికారులు, టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి ప్రజా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారన్నారు. గోరంట్ల సర్పంచు బాలకృష్ణ, గంగాధర్ నాయుడు ఉన్నారు.

వైసీపీ కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్'

కల్లూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని స్వగృహంలో డిజిటల్ యాప్‌ను ఆవిష్కరించారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే వాటిని డిజిటల్ బుక్‌లో సమోదు చేయాలన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని తాము అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచిపానలతో పాటు తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు.



యాప్‌ను విడుదల చేస్తున్న కాటసాని

దంచికొట్టిన వర్షం

- పొంగిపొర్లుతున్న వంకలు, వాగులు
- వర్షానికి కూలిపోయిన ఇళ్లు
- నీట మునిగిన పొలాలు
- స్తంభించిన రాకపోకలు



లింగంపల్లిలో వర్షం ధాటికి కుప్పకూలిన మట్టి మిద్దె



తురువగల్లులో పడిపోయిన ఇల్లు



మద్దికెరలో వర్షానికి కూలిన మట్టి మిద్దె

దేవనకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం రాత్రి 142.6 మీల్లి మీటర్ల భారీ వర్షం కురిసింది. దాదాపు ఆరుగంటపాటు కురిసిన వర్షానికి పంటపొలాలు నీట మునిగాయి. నెలన్నరగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతిన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి కురిసిన వర్షానికి వేరుశెనగ, టమోటాల, అముదం, పంటపొలాలు భారీగా కోతలకు గురయ్యాయి. నేలతలమర్రి, కరివేముల, మాచాపురం, దేవనకొండ, చెరువులు నిండిపోయి ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాలకు వెళ్లే రాకపోకలు స్తంభించాయి. దేవనకొండ, పోట్లపాడు గ్రామంలో పొలాల వద్ద, హంద్రీసమీపంలో ఆరబెట్టేందుకు నిల్వ ఉంచిన పత్తి వర్షంనీటికి కొట్టుకుపోవడంతో రైతులు అవేదన వ్యక్తం చేశారు. కప్పట్రాళ్ల వద్ద



దేవనకొండలో కూలిపోయిన ఇల్లు

హంద్రీనీవా కాలువ ప్రమాదకరంగా పారుతుండటంతో రైతులు, అధికారులు గట్టుకి మట్టివేశారు.

ఆస్పరి: మండలంలోని తురువగల్లు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూడు ఇళ్లు కూలాయి. గత వారం రోజులుగా భారీ వర్షాల కారణంగా గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, సుంకన్న, బుడ్డా ఓవన్న ఇళ్లు శనివారం గోడలు తడిచి తడిచి కూలిపోయాయి. ఎవరికీ కూడా ప్రాణహానీ జరగలేదు. తమకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని బాధితులు మండల అధికారులను కోరుతున్నారు.

మద్దికెర :మండలంలో ఈ ఏడాది భారీ వర్షాలు పడుతుండటంతో పురాతన మట్టిమిద్దెలు కూలుతున్నాయి. శనివారం తెల్లవారుజామున తుఫాన్ ప్రభావంతో మండలంలో కురిసిన వర్షాలకు ఆయా గ్రామాల్లోని మట్టిమిద్దెలు కూలాయి. ఇప్పటి వరకు పది మంది బాదితులకు నష్టపరిహారం అందించాలని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గుండాల్ నాయక్ మాట్లాడుతూ మట్టి మిద్దెలో నివాసం ఉండేవారు వర్షాలు పడేటప్పుడు బయట సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. మట్టిమిద్దెలు కూలిన లబ్ధిదారుల వివరాలను జిల్లా అధికారులకు పంపుతామన్నారు.

హొళగుంద: హొళగుంద మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో గజ్జెహల్లి గ్రామ శివారులోని పోతప్ప వంక పొంగిపొరలడంతో పొలాల్లో వర్షం నీరు నిలిచాయి. అలాగే హెబ్బటం వద్ద ఉన్న తెల్లవంక, చెల్ల వంకలు పొంగిపొర్లాడంతో ఆదోని నుండి హొళగుందలో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదోని నుంచి ఆలూరు మీదుగా బస్సులు హొళగుందకు చేరాయి. లింగంపల్లి గ్రామంలో వర్షం దాటికి కురువ మౌనేష్ మట్టి ఇళ్లు కూలీనట్లు స్థానికుల తెలిపారు. వర్షం వల్ల నష్టపోయిన రైతులకు, మట్టి ఇళ్ల యాజమానులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కార్మిక సంఘం నాయకులు కోరారు.

ఆదోని రూరల్ : మండలంలో గడిచిన రెండు రోజులుగా భారీ నుంచి అతీ భారీ వర్షం కురుస్తోంది. దీంతో పంటలు నీట మునగగా, ఆయా గ్రామాలకు అనుసంధానంగా ఉంటున్న వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పాండవగల్లులో నీట మునిగిన పత్తిపంటలో సీపీఎం నాయకులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధిక వర్షాలకు బయటకు రాకూడదని, ప్రవహిస్తున్న వాగులను దాటవద్దని, ప్రమాద స్థితిలో ఉన్న మట్టిమిద్దేల కింద ఉండవద్దని తహశీల్దార్ రమేష్ సూచించారు.



ప్రవహిస్తున్న నాగనాథనహళ్ళి వంక

టమాటా కిలో రూ.5



పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా

పత్తికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్ యార్డులో శనివారం టమోటా కిలో రూ5 ధరపలికింది. 10కిలోల జత గంపలు రూ 100 నుండి 150వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తక్కువగా వ్యాపారులు పంటను కొనుగోలుచేస్తున్నారని, పంటపెట్టుబడులు అటుంచి కోతకూలీలు, ఆటో రవాణాచార్జీలు కూడా దక్కడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే మార్కెట్‌యార్డుకు 20టన్నులు పంటరాగా 1.5టన్నుల మార్కెట్‌యార్డు ద్వారాకొనుగోలుచేశామని పంటనాణ్యతను బట్టి కొనుగోళ్లు జరుగుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. గత మూడురోజులక్రితం వరకు కిలో రూ10పైనే పలికిన ధరలు రూ5లోపు పడిపోవడానికి కారణం ఏంటని, వర్షంలో అధికకూలీలు చెల్లించి పంటకోతకోసి మార్కెట్‌కు తెస్తే కనీసగిట్టుబాటు ధర లబించకపోతే ఎలా అన్ని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఈకేవైసీతో అవినీతికి చెక్

దేవనకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిలో ఈకెవైసీతో అవినీతికి చెక్ పడుతుందని ఏపీవో రాజునాయక్ అన్నారు. మండలంలోని బండపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు ఈకెవైసీ చేసి, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటడం జరిగింది. ప్రతి ఒక్కరు ఒక మొక్కనాటాలని సుచించారు. ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణల కారణంగా జలమయం'



వరద బాధితులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వాగులు, వంకలు ఆక్రమణలకు గురైన కారణంగానే వరద నీరు రోడ్ల పైకి చేరుకోవడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం జరిగిందని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న విమర్శించారు. శనివారం లోతట్టు ప్రాంతాలను నాయకులు పరిశీలించారు. ఆక్రమణలను ఉపేక్షించకుండా తొలగించకపోవడంతో ఈ పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తోందని అన్నారు. లోతట్టు ప్రాంతాల వారి బ్రతుకుల చిన్నాభిన్నం అయ్యాయని వాపోయారు. అనేక మంది నిత్యావసర వస్తులు, బట్టలు కోల్పోయారని అన్నారు. బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. గోపాల్, తిక్కన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆస్పరి పెద్దబావిలో పారిశుధ్య పనులు



ఆస్పరిలో శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ మూలింటి రాధమ్మ

ఆస్పరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఆస్పరిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో సర్పంచ్ మూలింటి రాధమ్మ, రాఘవేంద్ర ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్నోఏళ్లుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో భారీ వర్షాలు పడడంతో పై భాగంలో ఉన్న చెరువులో వర్షపునీరుతో నిండి ఉంది. కింది భాగంలో ఉన్న పెద్దబావిలో నీరు ఊట రావడంతో గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న పెద్దబావిలో చెత్తాచెదారాన్ని శుభ్రపరిచి వినియోగంలోకి తెచ్చారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కరించడానికి ఈ పెద్దబావిని గ్రామ ప్రజలు అందుబాటులోకి తెచ్చామన్నారు.

కోట్ల వర్ధంతి

ఆదోని టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు భీమాస్ కూడలిలో ఉన్న కోట్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అవ్వ టౌన్ బ్యాంక్ బీవోఎం చైర్మన్ రాచోటి సుబ్బయ్య, మర్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, సోమశేఖర్ రెడ్డి ఆయనకు పూలమాలలు వేసి, ఆయన చేసిన సేవలను కొనియాడారు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, జిల్లా మాజీ ఉపాధ్యాక్షులు దిలీప్ ధోకా,మారుతిరావు, శ్రీనిత్ రాయల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తా

తుగ్గలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని, అలాంటి వృత్తి చేపట్టడం నా అదృష్టమని, విద్యార్థులకు మంచి విద్యను అందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతామని డీఎస్సీలో ఎంపికై ఉపాధ్యాయ వృత్తి చేపడుతున్న అఖిలి రాధ తెలిపారు. శనివారం మండల పరిధిలోని జొన్నగిరి చెందిన నాగరాజు, కళావతి దంపతుల కుమార్తె అఖిలి రాధ డీఎస్సీకి ఎంపిక కావడంతో అమరావతిలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. దీంతో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అభినందనలు తెలిపారనీ, గ్రామస్థులు కూడా అభినందనలు తెలిపారు.

ఆలూరు-పెద్దహోతూరు రహదారికి మరమ్మతులు

ఆలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు-పెద్దహోతూరు ప్రధాన రహదారి వర్షాలకు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం ప్రచురితమైన అధ్వానంగా ఆలూరు-పెద్దహోతూరు రహదారి అనే వార్తకు స్పందించిన ఆర్‌అండ్‌బి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మద్దికెర సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డులు సరఫరా చేయడం జరిగిందని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, మండల టీడీపీ అధ్యక్షులు ఎస్.లక్ష్మినారాయణ, ఆర్ఐ రామదాసు అన్నారు. శనివారం స్థానిక గిడ్డయ్య వీదిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, వీఆర్వో రంగస్వామి, డీలర్ రవి ఉన్నారు.

తుగ్గలి:ప్రతి ఒక్కరికి రేషన్ పంపిణీని స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా అందిస్తామనీ తహసీల్దార్ రవి అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, డీలర్లకు స్మార్ట్ కార్డులను అందించారు. డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, వీఆర్వోలు నవీన్ పాటిల్, డీలర్స్ సంఘం అధ్యక్షుడు సుంకన్న, చంద్రశేఖర్ యాదవ్, తిమ్మప్ప, రంగన్న పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని అర్హులైన పేదలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. సమావేశంలో డీలర్లు అందరికీ స్మార్ట్ కార్డులు మిషన్లు వారికి అందజేశారు. ఆర్ఐ రాజశేఖర్‌గౌడ్, పాల్గొన్నారు.

ఆలూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలూరు మండలానికి 16,257 స్మార్ట్ కార్డులు సరఫరా అయ్యాయని, వాటిని ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని ఆలూరు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు లాగిన్ ద్వారా ఇంటింటికి పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఆస్పరి: కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా టెక్నాలజీకి అనుసంధానంగా స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి శనివారం రేషన్ డీలర్లకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు వారి ఇంటి వద్దకు వెళ్లి కార్డులను, సరుకులను అందిస్తామన్నారు. పాత రేషన్ కార్డులు ఉన్న ప్రతిఒక్కరికీ కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. వీటిని డీలర్లు అందజేయాలన్నారు.

ఆలూరు అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



కలెక్టర్ సిరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ డా.సిరిని కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలూరు ప్రాంతానికి సాగు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం వేదావతి ప్రాజెక్టు అవసరమన్నారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న రహదారులను మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. వర్షాలకు పూర్తిగా ఛిద్రమైన ఆలూరు-పెద్దహోతూరు రహదారి టెండర్లు పూర్తి చేసి నిర్మాణం పనులు ఆరంభించాలని కోరారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



ఎం.కొట్టాల చర్చిలో ప్రార్థనలు చేస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి ఆలూరు మండలం ఎం.కొట్టాల గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్, జిల్లా నాయకులు కటారుకొండ శీనప్ప ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో, సుంకులమ్మవ్వ ఆలయంలో ప్రార్థనలు చేశారు. వర్గాలకు తావులేకుండా అందరినీ ఒకేతాటిపైకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, టీడీపీ నాయకులు కృష్ణయాదవ్, రామాంజినేయులు, ప్రతాప్, ఎర్రిస్వామి, దేవరాజు, కురువ హనుమప్ప, కూపేంద్ర పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆదోని రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎంపీపీ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీవో జనార్ధన్ తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు నిర్వహించే రోజుల్లో ఇతర సమావేశాలు నిర్వహించరాదని, అందుకే ఆదివారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కావున ఈ సమావేశానికి ఎంపిటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత చోటు చేసుకొంది. కారణం ప్రస్తుత ఎంపిపి బడాయి దానమ్మపై మెజార్టీ సభ్యులు కలిగిన వైసీపీ ఎంపిటీసీలు ఆమెను దించడానికి అవిశ్వాస తీర్మానం చేపట్టి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాలకు పంటలన్నీ దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక సి.ఆర్.భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలకు పంటలన్నీ దెబ్బతిని రైతులు తీరని నష్టం జరిగిందన్నారు. ప్రతిరైతుకు ఉల్లి, టమాటా, పత్తి పంటలకు రూ.50 వేలు, మిగతా పంటలకు రూ.30 వేలు చొపున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్ కారుమంచి, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, వీరన్న, సహాయ కార్యదర్శి కాశీ పాల్గొన్నారు

సాహిత్యంలో గుర్రం జాషువా స్థానం చెరగనిది



మాట్లాడుతున్న అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహల్లాద

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువ చెరగని స్థానం సంపాదించుకున్నాడని, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహల్లాద అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ హైస్కూల్లో అరసం, ఎస్టీయూ ఆధ్వర్యంలో గుర్రం జాషువ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కులంహకారం వల్ల ఎదుర్కొన్న తిరస్కారాలు, అవమానాలకు జాషువ కృంగి పోకుండా, సవాలుగా తీసుకొని, ఎన్నో కవిత్వాలు, రచనలు చేశారన్నారు.. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమేష్ నాయుడు, సుంకన్న, అరసం నాయకులు మల్లికార్జున, సత్యనారాయణ, రవి, సుధాకర్, కొమ్ము ప్రసాద్, వెంకటేష్, సుధాకర్ బాబు, సక్కరి భాస్కర్, రాజశేఖర్, రామాంజి పాల్గొన్నారు.

పార్వతీదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు వివిధరూపాల్లో దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



ఆదోనిలో బాలాత్రిపుర సుందరి అలంకరణలో ..



మద్దికెర: లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో..



పత్తికొండ: పార్వతీదేవి అలంకరణలో..



ఆలూరు: అలంకరణలో అమ్మవారు

'జగన్‌ను విమర్శించడం మంచి పద్ధతి కాదు'

మద్దికెర సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ విమర్శించడం తగదని జడ్పీటీసీ సభ్యులు డి.మురళిధర్ రెడ్డి, మండల కన్వీనర్ మల్లికార్జున యాదవ్ అన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా శాసనసభ సమావేశంలో హుందాగా వ్యవహరించాలి గానీ, సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడటం సరికాదన్నారు. బాలకృష్ణ తన తప్పును తెలుసుకుని ఆయన వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవిపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎంపీటీసీ కాల్వ రామకృష్ణ, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ గంపల వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణయాదవ్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తుగ్గలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున అన్నారు. శనివారం మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లో పర్యటించి గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు వివరిస్తూ వాటిపై వచ్చిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మత్తుపదార్థాలు, మద్యంకు దూరంగా ఉంటే గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగవన్నారు.

మద్యం నియంత్రణకు ప్రత్యేక నిఘా



సారా స్థావరంపై దాడులు చేస్తున్న ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బంది

ఆలూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు బన్నీ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని మద్యం నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆలూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ లలితాదేవి అన్నారు. ఆలూరు మండలం అరికేర కొండల్లో శనివారం ఎక్సైజ్-ఫారెస్టు శాఖల సిబ్బందితో కలిసి సారా స్థావరాల దాడులు నిర్వహించి, 150 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసిన వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. సారా, కర్ణాటక మద్యం విక్రయించే వారి వివరాలు తమకు తెలియజేయాలని కోరారు. ఎస్ఐలు నవీన్‌కుమార్, షరీఫ్, సిబ్బంది విజయ్, సోము, ఫారెస్ట్ బీట్ అధికారులు బాలకృష్ణ, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

తుగ్గలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, మాజీ ఎంపీటీసీ వల్లె వెంకటేశ్ అన్నారు. శనివారం మండలంలోని తుగ్గలి, రాంపల్లిలో జీఎస్టీ సంస్కరణల వలన ప్రజలకు జరిగే మేలుపై లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. జీఎస్టీ తగ్గిన వివరాలను ప్రభుత్వం ప్రకటించిందని, వాటి ప్రకారం అన్ని షాపుల్లో ధరలు తగ్గించి సరుకులు అందిస్తారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మన్న, లక్ష్మికాంత్ నాయుడు, తదితరులు ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో మేలు

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు



కార్డులు పంపిణీ చేస్తున్న దేశాయి మాధవరావు

నందవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సులభతరం చేసేందుకే ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు నందవరంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశాయి మాట్లాడుతూ ప్రజలకు స్మార్ట్ కార్డులు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో బీమశేఖర్, బెస్తా ఈరన్న, వెంకటేశ్వర్లు, మల్ల, శ్రీనివాసులు,పంపయ్య పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

మంత్రాలయం,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి) :మండలంలోని చెట్నహళ్లి వద్ద హైవే రోడ్డుకు ఉంచిన బారికేడ్లను మోటార్‌సైకిల్ ఢీకొని మంత్రాలయానికి చెందిన సయ్యద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

గొర్రెలకు నష్టపరిహారం అందించాలి

కౌతాళం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వర్షాలకు మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతు సంఘం నాయకులు మల్లయ్య, ఈరన్న కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చిరుతాపల్లి, మల్లనహట్టి గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులు అయ్యన్న, నాగరాజు, నరసింహులకు చెందిన దాదాపు 50 గొర్రెలు వ్యాధుల బారిన మృత్యువాత పడ్డాయని, వీటి విలువ దాదాపు రూ.3లక్షల వరకు ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: టీడీపీ

మంత్రాలయం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంచాల సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం రూ పొందించిన స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, గుర్నింటి భీమిరెడ్డి, ఖాజా, నాగరాజు పాల్గొన్నారు.

వర్షాలకు 15 గొర్రెలు మృతి

కోసిగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కోసిగి మండలంలోని పులికనుమ ప్రాజెక్టు సమీపంలో 15 గొర్రెలు మృతి చెందినట్లు పెద్దకడుబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు కురువ వీరనాగప్ప, పెద్ద వీరన్న తెలిపారు. శనివారం రాత్రి అధిక వర్షాలు కురవడంతో చలికి తట్టుకోలేక గొర్రెలు మృతి చెందినట్లు కాపరులు తెలిపారు. దీంతో రూ.2లక్షల మేర నష్టం జరిగిందని, జీవనాధారం కోల్పోవడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరులు విన్నవించారు.

ఊరు ఏరాయె..
బతుకు బరువాయె..

● తిరుమల నగర్ వాసులకు తీరని కష్టాలు ● మడుగులా కాలనీ.. రోడ్డెక్కాలంటే కష్టం ● పట్టించుకునే వారేరీ...



తిరుమల నగర్‌లో డ్రైన్లు, రోడ్లు లేకపోవటంతో ఇళ్లమధ్యలో నిలిచిన వర్షం నీరు



బ్లాజం స్కూల్ వద్ద ఇళ్ల ముందు నిలిచిన వర్షం నీరు



గంజహళ్లి వరద నీటిలో మునిగిన పత్తి పంట

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే తిరుమలనగర్ వాసులకు తిప్పలే.. తిప్పలు.. ఇళ్లముందు నీరు మడుగులా నిలిచిపోతుండటంతో ఇళ్లనుంచి ప్రధాన రోడ్డు ఎక్కాలంటే అవస్థలు పడుతున్నారు. తిరుమల నగర్‌లో రహదారులు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు.. ప్రజాప్రతి నిధులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురువటంతో తిరుమలనగర్‌లో మట్టి రహదారులపై, ఇళ్లచుట్టూ నీరు నిలిచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్లు మడుగులా దర్శనమిస్తున్నాయి. అలాగే వాన నీరు వెళ్లేందుకు మురుగు కాలువలు లేకపోవటంతో నీరు ఎక్కడిపడితే అక్కడ నిల్వచేరింది. మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో ఉన్న ఈ కాలనీకి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు ప్రాతినిత్యం వహిస్తుం డటం విశేషం. కాలనీలో ఒక సీసీ రోడ్డు మినహా మరే రోడ్డు, డ్రైనేజీలు కనిపించటం లేదు. రహదారుల్లో గుంతలు పూడ్చుకు నేందుకు కాలనీవాసులు సొంత డబ్బును వెచ్చించి గరుసును తెప్పించుకున్నారు. అయినా అధికారుల్లో స్పందన లేదు.

గోనెగండ్లలో కుండపోత వర్షం

ప్రభుత్వ పాఠశాలలోకి చేరిన వరద నీరు

గోనెగండ్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మం డలంలో శుక్రవారం తెల్లవారు జామున నుంచి శనివారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. గంజహళ్లి, బైలుప్పల, గోనెగండ్ల, గాజులదిన్నె, కులుమాల, తదితర గ్రామాలకు చెందిన పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. కేవలం బైలుప్పల, గంజహళ్లి గ్రామాల్లో దాదాపు 2500 ఎకరాల్లో పత్తి పొలాలు నీట మునిగాయి. లక్షల ఆస్తినష్టం జరిగింది. శుక్రవారం నుంచి శనివారం తెల్లవారుజామున వరకు గోనెగండ్లలో ఎడతెరిపి లేకుండా 83.6 ఎంఎం వర్షం కురిసింది. దీంతో పత్తి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 8000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దీంతో గాజులదిన్నె, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల, అలావాల, కులుమాల గ్రామాల్లో పత్తి సాగు చేసిన పంట పొలాల్లో వర్షపునీరు నిలిచిపోయింది

పొంగి పొర్లిన మల్లెల వంక

గంజహళ్లి, అగ్రహారం గ్రామాల వద్ద మల్లెల వంక కుండ పోత వర్షానికి పొంగిపొర్లింది. దీంతో అగ్రహారం, బైలుప్పల, తెర్నెకల్లు, గ్రామాలకు గంజహళ్లి నుంచి రాక పోకలు నిలిచి పోయాయి. గంజహళ్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల పరిసర ప్రాంతాల్లోకి వరద వచ్చి చేరింది. తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మణిమంజరి ఆయా ప్రాంతాలలో పర్యటించారు.

జీడీపీ ప్రాజెక్టు ఎగువ ప్రాంత రైతుల ఇక్కట్లు

గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంత పొలాల్లోకి ప్రాజెక్టు నీరు వచ్చి చేరుతోంది. 150 ఎకరాల్లో సాగు వేరుశనగ, పత్తి, మిరప, పంటలు నీటిలో కుళ్లి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 376.8 మీటర్ల నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 377మీటర్లు అయితే ఎగువ ప్రాంతమైన ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామంలో సాగు చేసిన పంటల దరిదాపులకు ప్రాజెక్టు నీరు చేరుతోంది. పంటలు కుళ్లి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



గోనెగండ్ల: వరద నీటిలో ఆడుకుంటున్న పిల్లలు

కౌతాళం: మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జనజీవనం స్తంభించింది. బాపురం, ఉప్పరహాల్, కుంబళనూరు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లక్ష్మీనగర్ క్యాంపు, కౌతాళం-హల్వి వంక, బాపురం వంక ఉధృతంగా ప్రవహించడంతో గంటల కొద్దీ రాకపోకలు స్తంభించాయి.



మంత్రాలయం: పత్తి పంటలో నిలిచిన నీరు



సుంకేశ్వరిలో ఎరువుల గోడౌన్ వద్ద వాన నీరు



ఎమ్మిగనూరు: కలుగొట్ల గ్రామంలో ఎడతెరిపిలేని వర్షానికి కూలిన ఇల్లు



కోసిగిలో ఉధృతంగా ప్రవహిస్తున్న చాపవంకను పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్, సీఐ మంజునాథ్



భారీ వర్షానికి గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి వద్ద నీట మునిగిన వేరుశనగ పంట



వేముగోడు వద్ద నీట మునిగిన పత్తి పంట

మెగా జాబ్‌మేళాకు స్పందన

కోసిగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని మౌంట్ కార్నల్ హై స్కూల్‌లో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కంపెనీల ఆర్గనైజర్ అయ్యప్ప శర్మ నేతృత్వంలో 65 కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలలో పాల్గొన్నారు. ఈ మేళాలో మంత్రాలయం మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మంత్రాలయం యువ నాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

బీవీ హయాంలోనే గ్రామాభివృద్ధి : టీడీపీ



వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ తీయిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి హయాంలోనే కె.తిమ్మాపురం గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తోందని గ్రామ ఉప సర్పంచ్ ఉరుకుందు, యూనిట్ కన్వీనర్ ఉరు కుందులు అన్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి గ్రామంలోని వీధుల్లో నీరు చేరాయి.డ్రైనేజీలు నిండి వర్షపునీరు వెళ్లే దారి లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాలతో వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లేలా ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో బీటీ శ్రీరాములు, రాముడు పాల్గొన్నారు.

నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వైడబ్ల్యూసీఎస్ సొసైటీ సభ్యులుగా కొనసాగినంత కాలం నివాసం ఏర్పాటు చేసుకుని ఉండవచ్చు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శనివారం వైడబ్ల్యూసీఎస్ సొసైటీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.